


# పతివ్రత

## చింతపట్ల సుదర్శన్

**లక్ష్మణ్‌జీ గీచిన గీతని సీతామాతాజీ దాటి వుండవచ్చుగానీ, తన భార్యయైన సుగుణ తన మాట జవదాటదన్నది సుందరం గాఢ విశ్వాసం. ఆ భరోసాతోనే తనను కిరోసిన్ పోసి తగులబెట్టడానికి ప్రయత్నించిన అతగానికి చాకచక్యంగా బుద్ధిచెప్పిన సుగుణ లౌక్యాన్ని చక్కగా ఆవిష్కరించిన కథ ఇది.**

కిరోసిన్ షాపులో క్యూ ఎన్ని కిలోమీటర్ల పొడవున ఉంటుందోనని బెంబేలు పడుతూ ఆదరాబాదరా, గబగబా గజిబిజీ ఆలోచన్లతో బిజీబిజీగా నడిచిపోతున్నాడు సుందరం. కొందరికి తమకి బ్రహ్మారాసి పెట్టని వాటిని పేర్లుగా పెడుతుంటారు తల్లిదండ్రులు. సుందరానికి లేనిది అతని పేరుగా పెట్టి ధన్యులయ్యేరు మాతాపితలు.

సుందరం లేచి నిలబడ్డా పొడవాటి శాల్తీ కూచున్నట్టుంటాడు. కొంచెం వంగి నడుస్తాడు గానీ, పొడుక్కేం తక్కువ లేదు అని అతగాడి వాదన. తల నిటారుగా నించోబెట్టమంటే ఎలా కుదురుతుంది మెడని బాడీకి టైటుగా కుట్టేడు గదా ఆ త్రీ హెడ్స్ గాడ్ అంటాడు. పొడవులో తగ్గింది వెడల్పులో అడ్జెస్టు చేసేడు కాబట్టి కొంచెం లావయిన మాట వాస్తవమే అని ఒప్పుకుంటాడు. కళ్ళూ, చెవులూ, ముక్కూ తన పేరుకు తగ్గట్టు లేవని అటూ ఇటూ పెరగడమో, తరగడమో చేసేయని ఎవరన్నా అంటే కస్సుమంటాడు. సుందరంగా వుండకపోయినా సుందరం పేరు సుందరం అయినా, నీలోపల నిల్లు సుందరం అనే పదార్థం అనెవరన్నా అంటే మాత్రం తన ఎత్తుకు నాలుగింతలు అథ్లెట్‌లాగు ఎగిరి కస్సుమంటాడు. కస్సుమనడం, కయ్యిమనడం, కోపం వస్తే మనిషిని కాననడం, సుందరం అనబడే శాల్తీ ప్రకృతి స్వరూపస్వభావం. ఎదటి మొహమ్మీద కుండబద్దలు కొట్టడం అతగాడి సంభాషణా చాతుర్యానికి గీటురాయి.

ఇట్లాంటి ఈ సుందరం ప్రస్తుతం కిరోసిన్ షాపుకి అరైవ్ అయ్యేడనగా చేరుకున్నాడు. షాపులో క్యూ కిలోమీటర్ల లెక్కని కాదు కదా, సెంటిమీటర్ల లెవెల్లో కూడా లేకపోవడం, ప్రపంచంలో అనుక్షణం ఎన్నోవింతలు జరుగుతుంటాయనడానికి ప్రత్యక్ష నిదర్శనం. ఆశ్చర్యంలో పడి మళ్ళీ ఈది రావడానికి లేటవుతుందని సుందరం పళ్ళేదు. షాపువాడికి డబ్బులూ, డబ్బా ఇచ్చి కాసేపు చేతులు నలుపుకున్నాడు. చెడిపోని క్రాపుని ఎడం చేత్తో సవరించుకున్నాడు. రెండుసార్లు ఆవలించేడు. తుమ్ము ఓటి తుమ్ముదామనుకున్నాడు. కానీ ఫ్యూచర్ కార్యక్రమం దృష్ట్యా వాయిదా వేసుకున్నాడు. కిరోసిన్ డబ్బా చేతికందిస్తూ, అనవసరంగా ఒత్తుగా పెరిగిన కనుబొమల్ని ఎగరేస్తూ –

'కిరోసిన్ అందుకేనా' అన్నాడు షాపు ఓనర్.

సుందరానికి ముచ్చెమటలు పోసేయో, పట్టేయో మొత్తానికి తడిసి ముద్దయిపోయేడు. బ్యాటరీ వీకయిన గోడ గడియారంలా గుండె వినబడేలా కొట్టుకోసాగింది.

సహజగుణం ఓటి వుంటాన్ని తేరుకుని 'అందుకేనా అంటే?' అని చన్నీళ్ళనుకుని వేణ్ణీళ్ళలో చెయ్యిపెట్టిన వాడిలా కయ్యిమన్నాడు.

'అదేసార్ గ్యాస్ షార్టేజీ కదా, అందుకేనా అన్నది అందుకే' అన్నాడు షాపూ, ఒత్తు కనుబొమ్మల ఓనరు.

'అందుకేనా అంటే నేనెందుకనుకుంటున్నానో అందుకని వీడికి తెల్సి అన్నాడనుకున్నాను, అందుక్కాదన్నమాట తేరుకుని తేలిగ్గా ఊపిరి ఒదిలి 'అందుకే మరి' అంటూ కాళ్ళకి 'రైట్' చెప్పేడు సుందరం.

కిరసనాయిలు యొక్క ఉపయోగములేమిటి. అందుకేనా అనగా ఏమేమి 'అందుకేనా'లు అని ఆలోచిద్దాం.

కిరసనాయిలుతో స్టవ్వూ, పొయ్యీ అంటించవచ్చు. ఈ కాలంలో గ్యాసుపొయ్యిలు విరివిగా పెరుగుతున్నవి కాన ఇది పూర్తి సత్యం కాకపోవచ్చు. కిరసనాయిలుతో దీపములు వెలిగించవచ్చు. ఇదిమాత్రం ఖచ్చితంగా సరిపోయేసత్యం అనవచ్చు. కడుపుకోత, గుండెకోత, ఊచకోతల మాదిరిగా కరెంటుకోత కూడా నిత్యసత్యమైన విషయంగా కనపడుతున్నది. ఈ కోతకి కిరోసిన్ దీపమే ఓ దిక్కు. ఇదిలాగే పెరిగితే ఒక దిక్కేమిటి అన్ని దిక్కులూ ఇదే.

అయితే, సుందరం కిరసనాయిలు తీసుకువెళుతున్నది మరొక అత్యంత ఆవశ్యకమైన అవసరార్థం. కిరసనాయిలు దేనికి? మనుషుల్ని అనగా ఆడవాళ్ళని అనగా పెళ్ళాలని, మళ్ళీ అనగా అనగా కట్నమూ, లాంఛనాలూ వగైరాలు దారుణంగా ఋణపడి వున్నవాళ్ళని తగలబెట్టుటకు, కాఫీకి నీళ్ళు పడేసినప్పుడో, అన్నం గిన్నె దించునపుడో చీరచెంగు అంటుకుని భగ్గుమందని. జనము నమ్మకపోయినా నమ్మించుటకు పనికి వచ్చే కిరసనాయిలు భర్తలపాలిటి కల్పచెరువు. అట్టి మహాక్రతు నిర్వహణకే సుందరం కిరసనాయిలు తెస్తున్నాడు. అతని 'అందుకే' అనగా 'ఇందుకే' నన్నమాట.

* * *

సుందరం భార్య సుగుణ. కన్నూముక్కూ వుండాల్సిన చోట తీరుగా వుంటాయి. నాజూగ్గా ఒకటి రెండు లీటర్ల కిరోసిన్‌కే తడిసేట్టుగా వుంటుంది. ఇట్లాంటి భార్యలుంటే భర్తలకు కిరోసిన్ ఖర్చు కలిసొస్తుంది కూడా. సాదాసీదా అమ్మాయి అని చుట్ట పక్కల వాళ్ళు మెచ్చుకుంటారు. ఈ కాలంలో అరుదుగా జన్మించిన పతివ్రత అని స్వయంగా నెత్తిన పెట్టుకుంటాడు అవసరమయినప్పుడు సుందరం. లక్ష్మణ్‌జీ గీచిన గీతని సీతామాతాజీ దాటివుండవచ్చుగానీ, తన భార్యయైన సుగుణ తనకూ, తన పేరుకూ సంబంధం లేకపోవడమనేదానికి 'క్వయిట్ అపోజిట్టు'గా ఉంటుందని సుందరానికి అపారమైన నమ్మకం. అంచేతే ఆవిడ పాతివ్రత్యానికి ఈవేళ పరీక్ష....

సుందరం చేతినించి కిరసనాయిలు డబ్బా కొత్త అగ్గిపెట్టే అందుకుంది సుగుణ.

పడక్కుర్చీలో కూచుని ఆమెకేసి సూటిగా చూస్తూ అడిగేడు చూపుల్తో 'ఆర్ యూ రడీ' అని. తయారేనా అంటే భోజనమనో, మరోటనో అపార్థం చేసుకోవద్దు. ఇంతకు ముందే ఓ బ్యాక్‌గ్రౌండ్ సీను జరిగిపోయింది, వాళ్ళమధ్య. సుందరం మామగారు అనగా అతగాడికి తగలబెట్టుకుందుకి భార్యని యిచ్చినవాడు....పరమ నీచుడు....నికృష్టుడు...వుండాకోరు...దగాకోరు. పెండ్లిలో ఆయన చేసిన బాసలు నీటిరాతలు. కట్నం బాకీ.... బాకీయే. స్కూటర్...అజాపజాలేదు. డెకోలం మంచాలకి చెట్లు నరకబడలేదు. పరుపులూ, పిల్లోలూ, కంచాలూ, బూట్లూ లేకపోవడంతోపాటు ఆ ఇంటికి వెళితే బ్రూ కాఫీ కూడా లేదు. దేర్‌ఫోర్, సో, కాబట్టి (సుందరం తల్లి ఆజ్ఞ అయ్యింది కాబట్టి పైవన్నీ తెచ్చేందుకు మరో కోడలు సిద్ధంగా వుంది కాబట్టీ) పతివ్రతా ధర్మనిర్వహణకు సుగుణకి అవకాశం ఇవ్వబడింది. సుందరం కోరిక తీర్చడానికి ఎగిరిగంతేసింది సుగుణ.

* * *

అర్ధరాత్రి...కిరోసిన్ చావులకి అనువైన రాత్రి. భార్యలని మార్చే భర్తల పాలిటి మధురరాత్రి. సుందరం లేచేడు.



2

నిద్రపోతున్న భార్యని లేపేడు. 'చెప్పిందంతా గుర్తుందిగా' అన్నాడు. 'ఆఁ' అంది ఆ ఇల్లాలు. 'ఎందుకేనా మంచిది మళ్ళీ విను. నువ్వు తగలడ్డాక బిగ్గరగా, పిచ్చి పిచ్చిగా వెర్రిమొర్రిగా కేకలేయకు. నేను జడుసుకుంటాను. ఒకవేళ మంటలకి తాళలేక నన్ను పట్టుకోవచ్చేవు, ముందు ముందు పెళ్ళి కావల్సినవాణ్ణి, ఏ పార్టు కాలిపోయినా, నా రేటు పడిపోగల్దు జాగర్త. పూర్వజన్మపుణ్యాన్ని హరీ అన్నావాసరి. కొన వూపిరి మిగిలిందా నా పేరు మాత్రం ఎక్కడా అనరాదు మరి' అన్నాడు సుందరం.

'ఎందుకంటానండీ! అసలు మీ పేరివిటండీ! కాఫీ కాస్తుంటే చీరచెంగు అంటుకుంటుంది కదండీ! అంది ఆమె'

'వెరీ గుడ్! యూ ఆర్ ది వైఫ్ - ఎ హజ్బెండ్ నీడ్స్, అనగా నీవంటి భార్య కదా భర్తకు కావల్సినది' అంటూ ఉబ్బితబ్బిబ్బైపోయేడు సుంధరం.

వంటింట్లో ఆమె వొంటి మీద డబ్బాలో ద్రవం పూర్తిగా వొంపేసేడు సుందరం. మొదటి అనుభవమే కనక ఎవరికైనా చేతులు వణుకుతాయి.

భర్త మలేరియా వణకు గమనించింది భార్య. 'మీరుండండి....మీ కెందుకు శ్రమ..." అంటూ అగ్గిపెట్టె అందుకుంది. 'భయపడతారు మీరు బయటకి వెళ్ళండి' అనరిచింది.

బయటి రూంలోకి వచ్చేడు సుందరం, వంటింటి తలుపు మూసేసి. రూంలో గోడమీద మేకుకి గుచ్చి వున్న తెల్లకాగితమ్మీద దృష్టిపడింది. విసురుగా వెళ్ళేడు. ఆ కాగితమ్మీద ' నా చావుకి నా భర్త సుందరమే తప్ప కాఫీ పెట్టటం కాదు' అని చూచి వ్రాత కాపీలోలా పదేపదే రాసుంది.

సుందరం కళ్ళని కరెంటుకోత కమ్మింది. ఆ కాయితాన్ని ముక్కలు ముక్కలుగా చించి కస్సుబుస్సుమంటూ వంటింట్లోకి వురికేడు. మాటాపలుకూ లేకుండా నించున్న భార్యచేతినించి అగ్గిపెట్టె లాక్కున్నాడు. 'పతివ్రతవా నువ్వు పతివ్రతవా' అని అరుస్తూ పూనక మొచ్చినవాడిలా అగ్గిపుల్లలు కాల్చి ఆమె మీద విసిరేయసాగాడు. ఆశ్చర్యం ఆమె అంటుకోవడం లేదు. ఎన్ని అగ్గిపుల్లలో...అన్నీ చప్పున చల్లారిపోతున్నయి.

సుగుణ ఉన్నట్టుండి ఫక్కున ఫకాలున నవ్వింది. నవ్వుతూనే, 'ఏమండీ నేను నిజంగా పతివ్రతనేమోనండీ, అందుకే అంటుకోవడం లేదు' అంది.

మరా కాగితం ...అలా రాశావేం...చించేశా అన్నాడు సుందరం

'అట్లాంటివి పొద్దుట్నించీ ఓ వందకాపీలు రాసి వుంచా' మళ్ళీ నవ్వింది సుగుణ.

'ఏయ్! నన్ను పట్టిద్దామనే' కసికొద్దీ మళ్ళీ అగ్గిపుల్ల విసిరేడు సుందరం.

'లాభం లేదు పతిశ్రీ. నేనంటుకోను. మీరు తెచ్చిన కిరసనాయిలు పారబోసి దాన్నిండా బోరింగు నీళ్ళు నింపేను' అంది పడీపడీ నవ్వుతూ.

కాళ్ళమీద నించి జారికింద పడిపోయేడు సుందరం. అట్లా పడిపోతున్నప్పుడు 'మీరు కావల్సినప్పుడల్లా కాల్చుకుతినడానికి భార్యలు బ్రెడ్ ముక్కలు కారు. పిచ్చిపిచ్చి వేషాలు వేయకండి. పోలీసుస్టేషన్లో నా ప్రాణాలకు ప్రమాదం గురించి ఫిర్యాదు కూడా చేశాను. వాళ్ళు కాస్సేపట్లో వచ్చి మిమ్మల్ని, మీ అమ్మగారిని కూడా అరెస్టు చేయడం ఖాయం' అని సుగుణ అనడం లీలగా వినిపించింది. ●

# అక్షరాల తారుమారుతో అర్ధభంగం

మనభాష - 13



డి.చంద్రశేఖరరెడ్డి

సంస్కృతం నుండి మనం అరువు తెచ్చుకున్న మాటల్లో థ, ధలతో ఉండే మాటలెన్నో ఉన్నాయి. అయితే ఈ రెండింటి మధ్యా భేదాన్ని పాటించడంలో పొరపాట్లు దొర్లుతుంటాయి. ఒకదానిబదులు ఒకటి రాయడమో, లేకపోతే అన్ని చోట్లా ఒకటే రాయడమో కూడా పరిపాటి. కొన్నిచోట్ల వీటిని తారుమారు చేయడం వల్ల అర్థభంగం వాటిల్లుతుంది. తక్కినచోట్ల ఉచ్చారణలో భేదం పోతుంది.

ఉదాహరణకు అర్ధ - అర్థ శబ్దాలను తీసికోవచ్చు. అర్ధ అంటే సగం. అర్థ అంటే కోరబడేది, ధనం. వస్తువు. ప్రయోజనం - శబ్దానికి ఉండే అర్థం. అర్థశాస్త్రం అన్నప్పుడు భూమి, బంగారం, ధనం సంపాదించే మార్గం తెలిపేది. చాణక్యుని నీతిశాస్త్రం అర్థశాస్త్రం. పదార్థం అన్నప్పుడు వస్తువు. కీర్త్యర్థం అన్నప్పుడు కీర్తి కోసం అని అర్థం. శబ్దార్థాలు అన్నప్పుడు పదమూ అది బోధించే విషయమూ. అర్థశాస్త్రం అన్న మాటకు ఈనాడు ధనసంబంధమైన విషయాలకు సంబంధించిన శాస్త్రంగా వాడుతున్నారు. అర్థ సంబంధమైనది ఆర్థికం. అర్థించు అంటే కోరడం. అర్థి అంటే అడిగేవాడు. అర్థన అంటే అడగడం. అభ్యర్థి, విద్యార్థి, ప్రత్యర్థి మొదలయిన పదాలన్నీ అంతే. సార్థకం అంటే ప్రయోజనవంతం. నిరర్థకం అంటే ప్రయోజన రహితం. సగం అన్న అర్థంలో తప్ప అర్ధ అనే మాటకు ప్రయోగం లేదు కాబట్టి తక్కిన అన్ని సందర్భాలలోనూ అర్థ అనే మాటనే వాడాలి.

**ఉపసర్గ నుండి వచ్చే మాటలు**

అధి ఉపసర్గ. అధిక, అధికార, అధిక్షేప, అధిప, అధిపతి, అధిరోహణ, అధిష్ఠాన, అధ్యక్ష, అధ్యాత్మ మొదలయిన పదాలన్నీ ఈ ఉపసర్గతో వచ్చేవే. ఈ పదాల నుండి ఆధిక్యం, ఆధిపత్యం, ఆధ్యాత్మికం వంటి మాటలు వచ్చాయి. అధస్ అంటే కింద, అధోలోకం అంటే కింద ఉండే లోకం. అధమ, అధర అనే మాటలు అధస్ నుండీ వచ్చాయి. అధముడు కిందివాడు. అధరం అంటే దిగువన ఉండేది. కింది పెదవి.

ఉపాధ్యాయుడు, అధ్యాపకుడు అధ్యయనం చేయించే వాళ్ల. వేదం చదివించే వారని అప్పటి అర్థం. ఇప్పుడు గురువు, చదువు చెప్పేవాడు అన్న అర్థంలో వాడుతున్నాం.

అధీనుడు అంటే స్వతంత్రం లేనివాడు, పరాధీనుడు. స్వాధీనం అంటే తన అధీనంలోనే ఉన్నది. స్వాధీనుడు అంటే స్వతంత్రుడు. అధునా అంటే ఇప్పుడు. అధునాతనం అంటే ఇప్పటిది. దీని నుండే ఆధునికం ఏర్పడింది.

అగాధం అంటే మిక్కిలి లోతైనది.

అధ్వరం, అవధానం, అనురోధం, అంతర్ధానం, అపరాధం, అభిధానం మొదలయిన మాటలన్నింటిలోనూ ధకారమే ఉంది. అంధ శబ్దానికి చూపు లేకపోవడం అని అర్థం. అంధత్వం, ఆంధ్యం, అంధకారం దీనినుండే వచ్చాయి.

అవధి అంటే హద్దు. ఆధి అంటే మానసిక వ్యథ.

*ధ కారానికి దాఖలాలు*

ఆధార, ఆయుధ, ఆరాధన, ఇంధన, ఊర్ధ్వ, ఓషధి, ఔషధ, కంధర, కబంధ, స్కంధ, స్కంధావార, బంధు, బాంధవ, క్రోధ, క్షుధ, గంధ, ప్రధాన, బంధ, ప్రబంధ, బంధన, యోధ, విధ, బాధ, బుధ, నిధి, ప్రతినిధి, ప్రాతినిధ్యం, సన్నిధి, నిధన, నిబంధ, నిబంధన, పరిధి, పరిధాన, సంధి, సంధ్య, వ్యాధ, వ్యాధి, వర్ధన, బోధన, బధిర, బంధుర, విధి, విధాన, విధేయ, విధాత, మధు, మధుప, మధుకర, మధ్య, మాధవ, వంధ్య, బుధ, విబుధ, వధ, వధూ, మూర్ధ, మేధా, రాధ, రుధిర, వివిధ, విరోధ, మేధా, శోధన, సాధారణ, సాధు, సాధ్వి, సుధా, సుధీ, సౌధ, సాధ్య, సాధన, సింధు, సైంధవ, సైరంధ్రి మొదలయిన శబ్దాలన్నింటిలో ధకారమే ఉంది.

*పదాదిలో ధ కారం*

పదాదిలో ధ కారమే ఉంటుంది. థకారం ఉండదు. అందువల్ల ధర, ధరణి, ధర్మ, ధూర్త, ధన, ధాన్య, ధ్వజ, ధార, ధరిత్రి, ధవళ, ధాత, ధాత్రి, ధ్రువ, ధ్వని, ధ్వంస, ధీ, ధీర, ధూళి, ధూసర మొదలయిన మాటలన్నీ ధ కారుదులే. ధర అంటే భూమి అని అర్థం. ధృఞ్ ధాతువు. ధరించేది అని అర్థం. భూమిని ధరించేది భూధరం. అట్లాగా పయోధరం, మహీధరం, గంగాధరుడు, చక్రధరుడు, గదాధరుడు, విద్యాధరుడు మొదలయిన మాటలన్నీ ఇటువంటివే.

*థ కారానికి తార్కాణాలు*

కథ అంటే రచింపబడేది. కథ అనేక రకాలు. ఉపరి కథ, ఖండకథ, ఉపకథ, బృహత్కథ. చిన్న కథను కథానిక అంటున్నాం. కూర్చబడినది గ్రంథం. గ్రథనం అంటే కూర్చడం. గ్రథితం అంటే కూర్చబడింది. గ్రంథి అంటే వెదురు కదుపు. తిథిలో థకారం ఉంటుంది. తిథి నుండే అతిథి, ఆతిథ్యం వచ్చాయి.

తథా అంటే ఆవిధంగా, అట్లా. యథా అంటే ఏవిధంగా, ఎట్లా. తథ్యం అంటే సత్యం. యథార్థం అన్నా యథాతథం అన్నా సత్యమే. యథాతథం అంటే ఉన్నదున్నట్లుగా అన్న అర్థంలో వాడుతున్నాం. తథాగతుడంటే బుద్ధుడు. ఏవిధంగా మునులు మోక్షం పొందారో ఆవిధంగా మోక్షం పొందినవాడనీ, మంచిజ్ఞానం కలవాడనీ అర్థం.

తీర్థం అంటే బావిదగ్గర ఉండే నీళ్ల తొట్టి, శాస్త్రం, ఋషులు సేవించిన జలాశయం, గురువు. తరింపజేసేది కాబట్టి తీర్థం. పథం అంటే తోవ. పథికుడు అంటే తోవలో నడిచేవాడు. త్రిపథగ అంటే గంగ. మూడు తోవలలో నడచినది. పంథ అన్నా మార్గమే. పాంథుడు అంటే బాటసారి. పథ్యం అంటే రోగం లేని మంచిమార్గం. పృథు అంటే విపులం, విశాలం, పెద్దది. పృథ్వి బహు ప్రయోజనాలను కలిగించేది. పృథివి, పార్థివ శబ్దాలు దీని నుండే వచ్చాయి. పృథక్ అంటే వేరు చేయడం. ప్రథమ అంటే తొలి. దీని నుండే ప్రాథమిక, ప్రాథమ్యం. వృథా అంటే వ్యర్థం. వ్యథ అంటే బాధ. నిశీథం అంటే అర్ధరాత్రి. నిశీథిని అంటే రాత్రి. నేపథ్యం, నైపథ్యం అంటే నేతలకు హితవైనది. భూమిక అన్న అర్థంలో వాడుతున్నాం. సమర్థ, శపథం, వీథి, మిథునం, మథనం, మంథనం, మిథ్యా, మన్మథ, రథ, సారథి, మనోరథ, భాగీరథి, భీమరథి మొదలయిన మాటల్లో థ కారమే ఉంది. కచటపతలకు థ ఒత్తే ఉంటుంది. గజడదబలకు ధ ఒత్తే ఉంటుంది. అశ్వత్థ, ఉత్థాన, కపిత్థ, సక్థి లలో థ కారం, ఉద్ధారణ బద్ధ, బుద్ధ, వృద్ధ, ప్రసిద్ధ, సిద్ధ, శుద్ధ, సిద్ధాంత, సగ్ధి, దగ్ధ, దుగ్ధలలో ధ కారం ఉంటాయి. సకారంతో థకారమే ఉంటుంది, ధ కారం ఉండదు. అస్థి, స్థూల, స్థితి, స్థాన, అవస్థ, స్థాలి, ప్రస్థాన మొదలయినవి ఉదాహరణలు. నాథ శబ్దానికి మాత్రం నాధ అన్న రూపాంతరం ఉంది. ◆



3